ఆదాయం బాగున్నా.. అభివృద్ధి సున్నా


ఆకివీడు వ్యవసాయ మార్కెట్ యార్డులో మరమ్మతులకు గురైన గొడౌన్లు


- అభివృద్ధికి ఆమడదూరంలో ఆకివీడు మార్కెట్ యార్డు
- చినుకు పడితే అధ్వానంగా మారుతున్న యార్డు ఆవరణ
- నిరుపయోగంగా 7 గోదాములు, మరమ్మతులూ కరువు


ఏఎంసీ ఆవరణలో నీట మునిగిన సీసీ రోడ్డు

ఆకివీడు: ఆకివీడు వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. ఆదాయం ఘనంగా ఉన్నప్పటికీ అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్న చందంగా ఉంది. మార్కెట్ యార్డు ఏర్పడి రెండున్నర దశాబ్దాలు కావస్తున్నా అభివృద్ధికి నోచుకోలేదు. ఆకివీడు, కాళ్ల మండలంలోని కొన్ని గ్రామాలు మార్కెట్ యార్డు పరిధిలో ఉన్నాయి. భీమవరం మార్కెట్ యార్డు నుంచి విడిపోయిన తరువాత ఆకివీడు యార్డుకు మొదట్లో రూ.కోటి పైబడి ఆదాయం వచ్చేది. ప్రస్తుతం ఈ ఆదాయం రూ.6 కోట్లకు చేరింది. మార్కెట్ యార్డులో రైతుల కోసం మొదట్లో 6 గొడౌన్లు నిర్మించారు. 2004లో మహానేత వైఎస్సార్ హయాంలో అప్పటి ఎమ్మెల్యే పాతపాటి సర్రాజు, ఏఎంసీ చైర్మన్ మోటుపల్లి గంగాధరరావు చైర్మన్‌గా **మరో రెండు** పెద్ద గొడౌన్లు నిర్మించారు. మార్కెట్ **ఆదాయం కూడా** రూ.3 కోట్ల మేర పెరిగింది. కొన్ని **గ్రామాల్లో వుంత** రోడ్లు నిర్మించారు. తదనంతరం **15 ఏళ్లుగా** మార్కెట్ యార్డు అభివృద్ధి మందగించింది. యార్డు ఆవరణ అడవిని తలపించే విధంగా పిచ్చిమొక్కలు మొలిచాయి. కొద్దిపాటి వర్షానికే ఆవరణ, లోపలి రోడ్లు నీట మునుగుతున్నాయి. యార్డులోని 8 గొడౌన్లలో ఒకటి ప్రైవేట్ వ్యక్తికి అద్దెకు ఇచ్చారు. మిగిలిన 7 గొడౌన్లు ఖాళీగా ఉంటున్నాయి. గొడౌన్ల పైకప్పు రేకులు, ఫ్లోరింగ్, కిటికీలు, షట్టర్లు అన్నీ పాడైపోయాయి. వీటి మరమ్మతులకు గతంలో రూ.23 లక్షలు కేటాయించినా పనులకు నోచుకోలేదు. దీంతో గొడౌన్లు వర్షం వస్తే పూర్తిగా తడిసి ముద్దయి రైతులు ధాన్యం నిల్వ పోసుకునేందుకు అవకాశం లేకుండా పోయింది. ధాన్యం ఆరబెట్టేందుకు కూడా ఈ ప్రాంతం అనువుగాలేదని రైతులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా, ఆకివీడు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆదాయం జిల్లాలోనే అత్యధికంగా లభిస్తుంది. ధాన్యం కొనుగోళ్లు, చేపలు, రొయ్యల ఎగుమతులు వంటి వాటితో పాటు, ఈ ప్రాంతంలోని మూడు చెక్‌పోస్టుల ద్వారా గత ఏడాది రూ.5.90 కోట్ల ఆదాయ లక్ష్యం కాగా రూ.5.93 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ ఏడాది రూ.6.30 కోట్ల ఆదాయ లక్ష్యం నిర్దేశించగా ఏప్రిల్ నుంచి జూన్ నెలాఖరునాటికి రూ.1.16 కోట్లు ఆదాయం రావడం విశేషం.

‘ఉపాధి హామీ’ మొక్కలు సిద్ధం


కొండేపూడిలో మొక్కలను దించుతున్న దృశ్యం


కుముదవల్లిలో నాటేందుకు సిద్ధంగా ఉంచిన మొక్కలు

పాలకోడేరు: పపర్యావరణ పరిరక్షణలో భాగంగా జాతీయ ఉపాధి హామీ పథకంలో గ్రామాల్లో కూలీలతో మొక్కలు నాటిస్తున్నా వాటి సంరక్షణకు చర్యలు కానరావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వెంకట్రామన్నగూడెం నుంచి 2,300 మొక్కలను ఉపాధి హామీ సిబ్బంది శనివారం తీసుకువచ్చారు. వీటిలో నిమ్మ, జామ, మద్ది, సీతాఫలం, గన్నేరు తదితర మొక్కలు ఉన్నాయి. ఇవి మండలంలోని గ్రామాల్లో కాలువల వెంబడి నాటేందుకు సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున పనులు జరగడం లేదని ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ పిల్లి చిట్టిబాబు చెప్పారు. ఈ మొక్కలకైనా రక్షణ చర్యలు తీసుకుంటారో లేదో వేచిచూడాల్సిందే.

తలసేమియా బాధితులకు రక్తదానం చేయాలి


భీమవరంలో తలసేమియా బాధితులతో ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం: నిండు ప్రాణాలను కాపాడానికి రక్తదానం ఎంతగానో దోహదం చేస్తుందని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరంలో శనివారం హోప్ చారిటబుల్ ట్రస్ట్, ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో తలసేమియా బాధితులకు రక్తదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి 20 రోజులకు రక్తం ఎక్కించుకునే తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం రక్తదానం చేయడానికి మానవత్వంతో ప్రతి ఒక్కరూ ముందుకురావాలన్నారు. ట్రస్ట్ ఫౌండర్ అల్లాడి రవితేజ మాట్లాడుతూ తలసేమియా వ్యాధిగ్రస్తులు రక్తం కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, వబిలిశెట్టి రామకృష్ణ, పొత్తూరి బాపిరాజు, నూకల శివ, బొల్లం సాయి పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం మానవత్వమని ఎమ్మెల్యే రామాంజనేయులు అన్నారు. పట్టణంలోని రజకపేటకు చెందిన పాలచి తాతారావు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుండడంతో ప్రశాంత్ టీమ్ హెల్పింగ్ హ్యాండ్స్ సమకూర్చిన రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని శనివారం బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే చేతులమీదుగా అందజేశారు.

బాల్య వివాహాలతో అనర్థాలు


వాలమర్రులో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ పులఖండం సత్యవేణి

పాలకొల్లు అర్బన్: బాల్య వివాహాలు చేస్తే శిక్షార్హులవుతారని సూపర్‌వైజర్ పులఖండం సత్యవేణి అన్నారు. పాలకొల్లు మండలం వాలమర్రు అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీవో సీహెచ్ ఇందిర ఆదేశాల మేరకు శనివారం మిషన్ శక్తి 100 కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు అవగాహన కల్పించారు. స్త్రీ, పురుషులు సమానమన్నారు. లైంగిక వేధింపులపై కిషోర బాలికలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత పట్ల అవగాహన పెంచుకోవాలని వివరించారు. ఎవరైనా ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి యువతులను మభ్యపెడుతుంటే ఆ సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఎస్.భవాని, కె.సత్యవతి, సీహెచ్ సుబ్బలక్ష్మి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం


ఢిల్లీలో అంబేడ్కర్‌కు నివాళులర్పించి మాట్లాడుతున్న పుష్పరాజ్

పెనుగొండ: ఎస్సీ, ఎస్టీలను వర్గీకరించడంతో పాటు, క్రీమీలేయర్‌ను వర్తింప చేయాలనడం దళితులను చీకట్లోకి నెట్టివేయడమేనని, రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ ఆరోపించారు. ఛలో ఢిల్లీలో భాగంగా రెండో రోజు శనివారం తెలంగాణ భవన్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు నివాళులర్పించి నిరసన వ్యక్తం చేసినట్లు వివరించారు. రిజర్వేషన్లను ఎస్సీ, ఎస్టీలకు దూరం చేసే కుట్రలకు పాలకవర్గాలు తెరలేపాయని విమర్శించారు. దీనిపై న్యాయ పోరాటం చేస్తామన్నారు. ఏపీ సీఎం చంద్రబాబుకు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి మాలల ఓట్లు పనికి రావా అని ప్రశ్నించారు. మాలల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడడం మానుకోవాలని హితవు పలికారు. జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య ఆధ్వర్యంలో త్వరలో హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించిన నిరసన వ్యక్తం చేయనున్నట్లు తెలిపారు. ఢిల్లీలో జరిగిన నిరసనలో వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ వర్కింగ్ చైర్మన్లు బూర్గుల వెంకటేశ్వర్లు, గోపోజు రమేష్, మన్నే శ్రీదర్‌రావు, జిల్లా అధ్యక్షుడు ఇంటి సుందర్ కుమార్, జిల్లా ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు నేతల సాల్మన్‌రాజు, జిల్లా కార్యదర్శులు చిల్లే రాజ్‌కుమార్, గెద్దం అబ్రహం పాల్గొన్నారు.

‘విష్ణు’లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే


విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందిస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని శ్రీవిష్ణు ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం 7వ గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. కళాశాల వైస్‌చైర్మన్ ఆర్.రవిచంద్రన్ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం ఉద్యోగాలపైనే దృష్టి పెట్టకుండా పారిశ్రామికవేత్తలుగా ఎదిగాలన్నారు. నేటి ప్రపంచంలో విస్తృత అవకాశాలున్నాయని, విద్యార్థులు వినూత్న ఆలోచనలతో అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. కళాశాల కార్యదర్శి ఆదిత్య విస్సమ్ మాట్లాడుతూ జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొని సంతోషంగా జీవించేందుకు స్వీయ చైతన్యంతో కృషి చేయాలన్నారు. అనంతరం 2020–24 బ్యాచ్‌కు చెందిన 883 మంది ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్స్, 18 మంది ఎంటెక్ విద్యార్థులు, 60 మంది ఎంబీఏ విద్యార్థులకు డిగ్రీ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జి.శ్రీనివాసరావు, డైరెక్టర్ పి.శ్రీనివాసరాజు, వైస్ ప్రిన్సిపల్ పి.వెంకటరామరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మార్జిన్లలో ఆక్రమణల తొలగింపు


రోడ్డు మార్జిన్ ఆక్రమణలను తొలగించాలని హెచ్చరిస్తున్న పోలీసు అధికారులు

ఆకివీడు: పట్టణంలోని ప్రధాన కూడలిలో జాతీయ రహదారి రోడ్డు మార్జిన్లలో దుకాణాల ఆక్రమణలను తొలగించేందుకు ఆకివీడు రూరల్ ఎస్సై జగదీశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్సై బి.నాగబాబు శనివారం చర్యలు చేపట్టారు. దుకాణదారులు రోడ్ల మార్జిన్లు ఆక్రమించి వ్యాపారాలు చేస్తుండటంతో ట్రాఫిక్‌కు ఇబ్బంది ఏర్పడుతోందని, యజమానులు రోడ్డు మార్జిన్లలో ఏర్పాటు చేసిన సామగ్రిని స్వచ్ఛందంగా తొలగించాలని, రోడ్డు మార్జిన్లు దాటి రావద్దని హెచ్చరించారు. షాపులకు వచ్చే వినియోగదారులు వాహనాలను రోడ్లపై నిలిపి ఉంచడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని, దుకాణాలకు కూడా ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. షాపుల యజమానులు పోటీ పడి సామగ్రి బయట పెడుతున్నారన్నారు. ఇది సరైన పద్ధతి కాదని యజమానులకు తెలియజేశారు. ఎస్సై నాగబాబు మాట్లాడుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేషనల్ కోర్సుల్లో ‘ఎస్ఆర్‌కేఆర్’కు ఏ గ్రేడ్


భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో గ్రేడ్ సర్టిఫికెట్ అందిస్తున్న దృశ్యం

భీమవరం: జాతీయస్థాయిలో ఐఐటీ చెన్నై నిర్వహించిన నేషనల్ ప్రోగ్రాం ఆన్ టెక్నాలజీ ఎన్‌హాన్స్‌డ్ లెర్నింగ్ (ఎన్‌పీటీఈఎల్) కోర్సుల్లో భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు జాతీయస్థాయిలో ఏ గ్రేడ్ లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు చెప్పారు. గ్రేడ్ సర్టిఫికెట్ అందుకున్న సందర్భంగా శనివారం ప్రిన్సిపల్ మురళీకృష్ణంరాజు, టెక్నాలజీ సెంటర్ హెడ్ నూకల గోపాలకృష్ణమూర్తిని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంత్‌వర్మ అభినందించారు. అనంతరం గోపాలకృష్ణమూర్తి మాట్లాడుతూ గత జనవరి నుంచి ఏప్రిల్ వరకు జరిగిన ఆన్‌లైన్ కోర్సుల్లో 454 మంది విద్యార్థులు, అధ్యాపకులు విజయం సాధించారన్నారు. వీరిలో ఇద్దరికి బంగారు పతకాలు, 77 మందికి సిల్వర్, మరో 218 మంది ఎలైట్ పతకాలు సాధించి దేశంలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన సంస్థల్లో ఒకటిగా నిలిచిందన్నారు. కళాశాల డైరెక్టర్ ఎం జగపతి రాజు, సీఎస్‌డీ విభాగం ఇన్‌చార్జి హెడ్ ఎం.సురేష్ బాబు పాల్గొన్నారు.

నిర్వాసితులను ఆదుకోవాలంటూ వినతి


ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుకు వినతిపత్రం అందిస్తున్న చెరుకువాడ గరువు ప్రజలు

ఉండి: హైవే విస్తరణ పనుల్లో భాగంగా చెరుకువాడలో ఇళ్లు కోల్పోతున్న ప్రజలకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుకు గ్రామస్తులు శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తామంతా జాతీయ రహదారి 165ను ఆనుకుని సుమారు 70 ఏళ్ల నుంచి నివసిస్తున్నామని, పంచాయతీ పన్నులు, కుళాయి బిల్లులు చెల్లిస్తున్నామని, అయితే కొద్దిరోజుల క్రితం మార్కింగ్ చేసిన అధికారులు తమ ఇళ్ళు కూలగొట్టేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. అయితే తమకు ఎటువంటి నష్టపరిహారం లేదా ప్రత్యామ్నాయం చర్యలు తీసుకోలేదన్నారు. తమకు న్యాయం చేసి నష్టపరిహారం లేదా ప్రత్యామ్నాయ మార్గం చూపించాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బాధితులకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం తరఫున నష్టపరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కట్టా రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

అన్ని కులాలనూ దామాషా ప్రకారం వర్గీకరించాలి


న్యూఢిల్లీలో ధర్నాలో మాట్లాడుతున్న నల్లి రాజేష్

పాలకొల్లు అర్బన్: ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ ఏపీ, తెలంగాణ మాలల ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద శనివారం ధర్నా నిర్వహించినట్లు ఏపీ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ చెప్పారు. వివరాలను స్థానిక విలేకరులకు ఫోన్‌లో వెల్లడించారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆర్టికల్ 341, ఆర్టికల్ 14కు భంగం కలిగించే విధంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్గీకరణ చేయవలసి వస్తే అన్ని కులాల్లో కూడా విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో కూడా అన్ని కులాలను జనాభా దామాషా ప్రకారం వర్గీకరణ చేసి అన్ని కులాలకు న్యాయం చేయాలని కోరారు. మాలమహానాడు జాతీయ, రాష్ట్ర నాయకులు గొల్ల అరుణ్‌కుమార్, పిల్లి సుధాకర్, మంత్రి నరసింహయ్య, సిద్ధాబత్తుల కొండబాబు, నల్ల చిన్నారావు, గుండె నగేష్‌బాబు, విప్పర్తి ప్రభాకరరావు, గారపాటి నానాజీ, మాల సంఘాల పెద్దలు పెద్ద సంఖ్యలో ధర్నాలో పాల్గొన్నట్లు రాజేష్ చెప్పారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా కట్టాలి

పెనుమంట్ర: ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు హర్‌ఘర్ తిరంగ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 11, 12, 13 తేదీలలో ప్రతి కార్యకర్త ఇంటిపై జాతీయ జెండా కట్టాలని జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి కొవ్వూరి వెంకటరెడ్డి అన్నారు. శనివారం ఆచంట అసెంబ్లీ బీజేపీ ముఖ్యనాయకుల సమావేశం మార్టేరు రోటరీ క్లబ్ భవనంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా ప్రజల్లో జాతీయ భావం కలిగేలా కార్యక్రమాలు చేసి అన్ని మండలాల్లో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పండుగలా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షులు నాగ సుబ్బారావు, బద్రి నారాయణ పాల్గొన్నారు.

వెన్నుపూస బాధితుడికి వాకర్స్ క్లబ్ సహాయం

పాలకొల్లు సెంట్రల్/యలమంచిలి: ప్రమాదంలో గాయపడి వెన్నుపూస సమస్యతో బాధపడుతున్న ఓ వ్యక్తికి పాలకొల్లు వాకర్స్ క్లబ్ తరఫున చేయూతనిచ్చినట్లు క్లబ్ అధ్యక్షులు తటవర్తి సుధాకరరావు చెప్పారు. యలమంచిలి మండలం ఊటాడ గ్రామానికి చెందిన బి.శ్రీనివాస్ ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లాడు. అక్కడ ప్రమాదానికి గురికావడంతో దాతల సహకారంతో స్వదేశానికి తిరిగివచ్చాడు. ఆ ప్రమాదంలో వెన్నుపూసకు గాయమై అప్పటి నుంచి మంచానికే పరిమితమయ్యాడు. ఈ విషయాన్ని స్థానికులు కొందరు పాలకొల్లు క్లబ్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో క్లబ్ స్పందించి అతనికి అవసరమైన రూ. 15 వేలు విలువ చేసే మందులను శనివారం అందించినట్లు సుధాకరరావు చెప్పారు. క్లబ్ సభ్యులు షేక్ ఫీర్ సాహెబ్, మానెం బసవరాజు, పోతుల ఉమాశంకర్, సోమంచి శ్రీనివాస శాస్త్రి, గ్రామ సర్పంచ్ బుడితి జయరాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోస్ట్‌మేన్ తోలేటి సేవలు అభినందనీయం


పోస్టుమాన్ తోలేటి దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

వీరవాసరం: తోకలపూడి గ్రామానికి తోలేటి శ్రీరామచంద్రమూర్తి 45 ఏళ్లుగా పోస్ట్‌మేన్‌గా అందించిన సేవలు అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. తోలేటి ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం రాయకుదురు సబ్ పోస్టాఫీసులో తోలేటి శ్రీరామచంద్రమూర్తి–నాగమణి దంపతులను పోస్టల్ సిబ్బంది, మండల పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. మెయిల్ ఓవర్సీస్ భీమవరం సబ్ డివిజన్‌కు చెందిన బి.రమణ, సబ్ పోస్టమాస్టర్ భగవాన్ గుప్త, తోకలపూడి బీపీఎం రాజు, పోస్ట్‌మేన్ సూర్యతేజ పాల్గొన్నారు.

రాజ్యాంగ సవరణతో దళిత క్రైస్తవులకు అన్యాయం


కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు

భీమవరం: రాజ్యాంగ సవరణ కారణంగా దళిత క్రైస్తవులకు జరిగిన అన్యాయానికి నిరసనగా భీమవరం కలెక్టరేట్ వద్ద శనివారం ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మత్తె రాజకుమార్ మాట్లాడుతూ 1950లో అప్పటి రాష్ట్రపతి బాబూరాజేంద్రప్రసాద్ రాజ్యాంగాన్ని సవరించి క్రైస్తవుల పట్ల పేరా 3లో పొందుపర్చిన అంశంతో దళిత క్రైస్తవులకు అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐసీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బందెల జార్జిరాజు, మత్తె నరేష్‌కుమార్, దానియేలు, బందెల ప్రమీల, జి లోకయ్య పాల్గొన్నారు.

యూటీఎఫ్ నాయకులకు సత్కారం


యూటీఎఫ్ నాయకుల్ని సత్కరిస్తున్న దృశ్యం

కాళ్ల: యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని వేంపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహించారు. నాయకులు బీఆర్ ఎంకే స్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కవులూరి సత్యనారాయణ, పొదిల శ్రీరామకృష్ణ పతాకావిష్కరణ చేశారు. పట్టాభిరామయ్య మాట్లాడుతూ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. సీనియర్ నాయకులైన శ్రీరామకృష్ణ, సత్యనారాయణలకు చిరు సత్కారం చేశారు. శంకర్, రాజ్యలక్ష్మి, కనకదుర్గ, మణి, అశోక్, రవికుమార్, అప్పలాచార్యులు, వర్మ పాల్గొన్నారు.

నేడు దొడ్డిపట్లలో మెగా వైద్య శిబిరం

యలమంచిలి: యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ సర్వీస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం దొడ్డిపట్ల హైస్కూల్లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షులు జక్కంపూడి మదన్ మోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలతో పాటు, కిడ్నీ, మూత్ర, చర్మ, దంత, నేత్ర, జనరల్ వ్యాధులకు వైద్యులు యాతం లక్ష్మీ శ్రీరంగ, జక్కంపూడి సుభాషిణి, కుసుమ ప్రశాంతి, కావలి మౌనితోపాటు అమలాపురం కిమ్స్ ఆసుపత్రి వైద్యులు ఉచితంగా పరీక్షలు చేస్తారన్నారు. శిబిరాన్ని పాలకొల్లు, యలమంచిలి పరిసర మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పని సర్దుబాటుతో ‘మున్సిపాలిటీ’కి అన్యాయం


రామభద్రంను కలిసి వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

నరసాపురం రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో పనిసర్దుబాటు నిబంధనల వల్ల మున్సిపాలిటీల్లో పనిచేసే ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతుందని యూటీఎఫ్ పట్టణ జనరల్ కార్యదర్శి ఎన్వీ చంద్రకుమార్, జిల్లా కౌన్సిలర్ కె జగ్గరాజు అన్నారు. ఈ మేరకు శనివారం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామభద్రంను కలిసి వినతిపత్రాన్ని అందజేశామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన పనిసర్దుబాటు నియమ నిబంధనల ప్రకారం ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపాలిటీలలో పనిచేసే ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడాన్ని వ్యతిరేకిస్తామన్నారు. అలా జరిగితే మున్సిపల్ ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని పెదగరువులో విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతులు, చెట్లు, కొమ్మల తొలగించే నిమిత్తం పలు గ్రామాలలో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్‌ఖాన్ శనివారం తెలిపారు. భీమవరం మండలంలోని పెదగరువు, చినగరువు, దిరుసుమర్రు, రాజుల గరువు, వెంప, శ్రీరామపురం, తుందుర్రు, జొన్నలగరువు, కరుకువాడ బేతపూడి, యమునాపల్లి, కొత్రపాడు గ్రామాలతో పాటు వీరవాసరం మండలంలోని దూసనపూడి, మత్స్యపురిపాలెం, కమతాలపల్లి, బాలేపల్లి గ్రామాలతో పాటు తుందుర్రు మెగా ఆక్వాఫుడ్ పార్కుకు ఉదయం 8 నుంచి 11 వరకు విద్యుత్ సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పలువురిని పరామర్శించిన ఎమ్మెల్సీ కవురు

వీరవాసరం: ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ రాయకుదురు, మత్స్యపురి గ్రామాల్లో శనివారం పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆయా కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి సంతాపం తెలిపారు. పరమపదించిన వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయా కార్యక్రమాల్లో తాడాల దుర్గా వరప్రసాద్, ఏలూరి బాలాజి, సూర్యనారాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్త కార్యవర్గాన్ని కించపరిస్తే చర్యలు

భీమవరం: భీమవరం అర్బన్ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గాన్ని కించపరిచే విధంగా ప్రవర్తించే సభ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు వెలగా శ్రీరామమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యిన్నమూరి వెంకటశ్రీనివాస్ (తెనాలి శ్రీను) అధ్యక్షునిగా ఎన్నికైన నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం ఈనెల 4వ తేదీన జరగాల్సి ఉండగా కొంతమంది సభ్యుల అసత్య ఆరోపణల కారణంగా ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశామన్నారు.

హెచ్‌ఐవీ బాధిత చిన్నారులకు పౌష్టికాహారం

భీమవరం: మానవతా సాంఘిక సేవా సంస్థ భీమవరం మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం హెచ్‌ఐవీ బాధిత కుటుంబాల పిల్లలకు పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు పెన్మెత్స రామ్మోహనవర్మ, కార్యదర్శి వేమూరి రాంబాబు మాట్లాడుతూ హెచ్‌ఐవీ బాధిత కుటుంబాల పిల్లలకు ప్రభుత్వం ఉచితంగా మందులు అందిస్తున్నప్పటికీ స్వచ్ఛంద సంస్థలు, దాతలు పౌష్టికాహారం అందించడం వల్ల ఇమ్యూనిటీ పెరిగి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. ఈనెల పౌష్టికాహారం అందించిడానికి ఆర్థిక సహాయం చేసిన సంస్థ సభ్యురాలు కలిదిండి పద్మావతిని అభినందించారు. సంస్థ చైర్మన్ పెద్దరాజు వెంకటపతిరాజు, సంస్థ కో–చైర్మన్ కార్మూరి బాబు, అల్లు శ్రీనివాస్, రాంబాబు, ఇందుకూరి ప్రసాదరాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

రైల్వే గేటు సమస్య పరిష్కరించాలని వినతి

ఉండి: ఎన్నార్పీ అగ్రహారంలో గోడౌన్స్ వద్ద ఉన్న రైల్వే గేటు సమస్య పరిష్కరించాలని కోరుతూ వాండ్రం గ్రామ సర్పంచ్ దాసరి వెంకటకృష్ణ ఆధ్వర్యంలో పలువురు కేంద్రం మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను శనివారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వేగేటును రాత్రి 7 గంటలకు మూసివేసి ఉదయం తెరుస్తున్నారని, ఈ గేటు నుంచి వాండ్రంతో పాటు ఐదారు గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారని, వీరు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రం అందించిన వారిలో మాజీ సర్పంచ్ రెడ్డిపల్లి సత్యనారాయణ, యాండంగి యేసు, బీజేపీ నాయకుడు లక్ష్మీనారాయణ తదితరులు కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మకు శనివారం వినతిపత్రాన్ని అందించారు. దీనిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

15న పాటల పోటీలు

నరసాపురం రూరల్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మదర్ థెరిస్సా దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 15న పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జిల్లాస్థాయిలో నిర్వహించే ఈ పాటల పోటీల్లో ఆసక్తి కలిగిన వారు తమ పేర్లను 12వ తేదీలోగా 98480 26302 సెల్ నంబర్‌కు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలన్నారు. 15వ తేదీ మధ్యాహ్నం 2గంటల నుంచి నరసాపురం వలంధర్ రేవులో ఈ పోటీలు జరుగుతాయన్నారు.